

# మనం

తూర్పు పశ్చిమ, కృష్ణ జిల్లాలు

గురువారం 17- 04 - 2025

4 పేజీలు



# నాటక రంగ పునరుజ్జీవనానికి కూటమి ప్రభుత్వం కృషి

- నంది అవార్డులు, నంది నాటకోత్సవాలు ఈ ఏడాది తప్పకుండా నిర్వహిస్తాం
- కళలు, కళాకారులకు మంచి రోజులు వచ్చాయి

రాష్ట్రంలో కళలు, సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరిస్తాం

- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర, టివి మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అర్హులైన 110 మంది కళాకారులు, సాంకేతిక నిపుణులకు రాష్ట్ర, జిల్లా స్థాయి కందుకూరి రంగస్థల పురస్కారాలు ప్రదానం చేసిన మంత్రి దుర్గేష్









విజయవాడ ఏప్రిల్ 16 మనం బ్యూరో కూటమి ప్రభుత్వంలో కళలు, కళాకారులకు మంచి రోజులు వచ్చాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. బుధవారం విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర, టివి మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కందుకూరి 177వ జయంతి సందర్భంగా నిర్వహించిన తెలుగు నాటక రంగ దినోత్సవం-2025 ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నాటక రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి కమిటీ ఎంపిక చేసిన 110 మందికి అవార్డులను మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. అందులో భాగంగా రాష్ట్రస్థాయిలో ముగ్గురికి కందుకూరి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారాలు, జిల్లాస్థాయిలో 26 జిల్లాలకు గాను 107 మందికి కందుకూరి విశిష్ట పురస్కారాలను మంత్రి దుర్గేష్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ బుర్రా సాయిమాధవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుకూరి పురస్కారాల ఎంపిక కమిటీ పనితీరును ప్రశంసించారు. నాటక రంగంలో లబ్ధ ప్రతిష్ఠులను నిష్పక్షపాతంగా పురస్కారాలకు ఎంపిక చేయడం గర్వంగా ఉందన్నారు. గడిచిన ఐదేళ్లలో ఈ తరహా కార్యక్రమాలు చేయకపోవడం బాధాకరం అన్నారు. కందుకూరి అవార్డ్స్ గురించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి చెప్పగానే సానుకూలంగా స్పందించడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు సీఎంకి, కళలను ప్రోత్సాహిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రముఖ సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, రచయిత కందుకూరి వీరేశలింగం పంతులు గారి గొప్పదనాన్ని వివరించారు. కందుకూరి వీరేశలింగం పంతులు గారు వ్యవహార ధర్మబోధిని, సత్య హరిశ్చంద్ర, అభిజ్ఞాన శాకుంతలం, వంటి నాటకాలు రాశారని, తొలి తెలుగు సాంఘిక నవల రాజశేఖర చరిత్రము రాశారని తెలిపారు. తెలుగుసాహిత్యంలో నాటకానికి, ఓ ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించింది, నాటకానికి సామాజిక ప్రయోజనం ఉండాలని మనసారా విశ్వసించిన నాటక రచయిత మన వీరేశలింగం పంతులు గారని వివరించారు. తెలుగు సాహిత్యంలో కందుకూరి చేపట్టని ప్రక్రియ లేదని, నవల, నాటకం, జీవిత చరిత్ర, ఆత్మకథ... ఇలా ఎన్నో ఎన్నెన్నో రాసారని తెలిపారు. తెలుగు గద్యం, తెలుగు పద్యం, తెలుగు వ్యవహారికం, తెలుగు జాతీయం, తెలుగు పలుకుబడి, తెలుగువారి జీవన విధానం ఇవన్నీ కందుకూరి వీరేశలింగం నాటకాలలో పుష్కలంగా దర్శనమిస్తాయన్నారు. మానవ సమాజానికి సరైన దిశానిర్దేశనం చేయడానికి నాటకం ఎంతో ప్రాముఖ్యత కలిగిన కళారూపంగా విశ్వసించిన మన కందుకూరి వీరేశలింగం గారు "వ్యవహార ధర్మబోధిని" అనే నాటకాన్ని రచించి నాటకం యొక్క అసలైన లక్ష్యాన్ని నిర్వచించారు. అనంతర కాలంలో వందలాది తెలుగు నాటక రచయితలకు ఈ బాటే నడచి రావలసిన బాటగా నిర్దేశింపబడిందనడంలో అతిశయోక్తి లేదని మంత్రి పేర్కొన్నారు.. ఈ సందర్భంగా నాటక రంగం అభివృద్ధికి కృషి చేసిన వీరేశలింగం పంతులు యుగపురుషుడిగా, నవయుగ వైతాళికుడిగా కీర్తించబడ్డారని మంత్రి దుర్గేష్ వివరించారు. తెలుగులో మొట్ట మొదటి నాటకం రాసిన గొప్ప వ్యక్తి కందుకూరి వీరేశలింగం పంతులు అన్నారు. ఈ సందర్భంగా కందుకూరి వీరేశలింగం పంతులును నాటకరంగ ఆద్యుడు గా అభివర్ణించారు. నంది అవార్డులు, నంది నాటకోత్సవాలు ఈ ఏడాది తప్పకుండా నిర్వహిస్తామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. పౌరాణిక, పద్య నాటకాలకు నేటికీ ఆదరణ ఉందన్నారు. ఆధునిక నాటకాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకతను వివరించారు. యువత నాటక రంగం పై మక్కువ పెంచుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో కళలను ప్రజా బహుళ్యం లోకి తీసుకువెళతామన్నారు. ఇటీవల తాను ఢిల్లీ వెళ్ళినప్పుడు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను కలిశానని ఆ సందర్భంగా విజయవాడలో కానీ లేదా రాజమండ్రిలో గాని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ను కేటాయించాలని కోరానని అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు మంత్రి గుర్తు చేశారు. నాటక రంగం బతికితేనే రాష్ట్రం బాగుంటుందన్నారు. అందుకు ఉదాహరణగా సాహితీ సమరాంగ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు పాలనను గుర్తు చేశారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో కళలు, సాంస్కృతిక వైభవం వెలుగొందిందని తెలిపారు. అదే తరహాలో రాష్ట్రంలో కళలు, సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరిస్తామని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. ఎక్కడైతే కళాకారులు గౌరవింపబడతారో, ఎక్కడైతే కళలు ఎల్లలు దాటి ముందుకు వెళ్తాయో ఆ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథంలో దూసుకెళ్తుంది అన్నారు. కళకు, కళా రంగానికి, కళాకారులకు పెద్దపీట వేస్తోన్న ఏకైక ప్రభుత్వం మా కూటమి ప్రభుత్వం అని తెలుపుతూ స్వతహాగా కళాకారుడైన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారు కళలకు ప్రాధాన్యతనిస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు. కళాకారులకు పెన్షన్ ఇచ్చే విషయం సీఎంతో చర్చించానని తెలిపారు. గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసి వెళ్లిందన్నారు. అందుకే కొంత ఆలస్యం అవుతుందన్నారు. త్వరలోనే మళ్లీ ఒకసారి ఈ విషయమై సీఎంను కలిసి మాట్లాడుతానన్నారు. కళాశాల స్థాయి లో తాను వేదికపై ప్రదర్శించిన నాటకాలని గుర్తు చేసుకున్నారు. వీరేశలింగం గారు నడిచిన బాట భావితరాలకు వెలుగుబాట అని తెలుపుతూ ఆయన జయంతిని తెలుగునాటక రంగ దినోత్సవంగా జరుపుకోవడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అన్నారు. రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశ లింగం పంతులు గొప్ప తనాన్ని వివరించారు. గడిచిన ఐదేళ్లలో మరిచిపోయిన నాటక రంగ పండుగ మళ్ళీ వచ్చింది అన్నారు. కళాకారులను ఆదరించేది కూటమి ప్రభుత్వం అన్నారు. పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖలకు మంత్రి దుర్గేష్ రూపంలో మంచి వ్యక్తి రావడం గర్వంగా ఉందన్నారు. నాటక రంగ అభివృద్ధికి ప్రతి ఒక్క కళాకారులు పాటుపడాలన్నారు. కళలు బతికించేందుకు కేంద్రం నుండి నిధులు తీసుకొస్తానని మంత్రి దుర్గేష్ చెప్పినట్లు గుమ్మడి గోపాలకృష్ణ తెలిపారు. నాటక రచయిత, ప్రముఖ సినీ రచయిత, కందుకూరి పురస్కారాల ఎంపిక కమిటీ చైర్మన్ బుర్రా సాయి మాధవ్ మాట్లాడుతూ నాటక రంగానికి మంచి రోజులు వచ్చాయన్నారు. కళాకారులు అయిన కీ. శే.ఎన్టీఆర్, పవన్ కళ్యాణ్ లు పార్టీలు పెట్టారని కళలు వెలిగేందుకు కారణం అయ్యారని, నాటక రంగానికి చేయూతనిస్తున్నారన్నారు. వీళ్ళ హయాంలో నాటక రంగం, కళలు వర్ధిల్లుతాయన్నారు. కళలకు ప్రాధాన్యత ఇస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్ కి ధన్యవాదములు తెలిపారు. రంగస్థల నటులు కందుల దుర్గేష్ మంత్రిగా ఉండడం శుభ పరిణామం అన్నారు. అందరు అర్హులకు అవార్డులు ఇవ్వడం సాధ్యం కాదు కానీ ఎంపికైన వాళ్ళు అందరూ అర్హులే అన్నారు. ఎఫ్ డీసీ మేనేజింగ్ డైరెక్టర్ హిమాన్షు శుక్ల స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం శుక్ల మాట్లాడుతూ అవార్డుల ఎంపికకు కృషి చేసిన కమిటీకి అభినందనలు తెలిపారు. నాటకం ఆవశ్యకత తెలియజేసారు. రాబోయే రోజుల్లో నాటక రంగాన్ని ప్రోత్సాహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి దుర్గేష్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. తొలుత ప్రార్థనా గీతంతో అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభం అయ్యింది.

# మే 2న ప్రధానమంత్రి నరేంద్ర మోడి అమరావతి పర్యటన





- ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష
- పి-4 ప్రారంభోత్సవం జరిగిన ప్రాంతం నుండే ప్రధాని చేతుల మీదగా అమరావతి రాజధాని పనులు పున:ప్రారంభం
- సోమవారం ఉ.11గం.లకు సచివాలయంలో ఏర్పాట్లపై మంత్రుల బృందం సమీక్ష
- ప్రధాని పర్యటనకు కట్టుదిట్టమైన పటిష్ట ఏర్పాట్లు

విజయవాడ ఏప్రిల్ 16 మనం బ్యూరో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి మే 2వ తేదీన అమరావతి రాజధాని పనులు పున:ప్రారంభించేందుకు రానున్నారని అందుకు సంబంధించి పటిష్టమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. ఈమేరకు ప్రధాని పర్యటన ఏర్పాట్లపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణకు రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్,కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్,నాదెండ్ల మనోహర్,పి.నారాయణలతో కూడిన మంత్రివర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం ఇప్పటికే నియమించిందని ఈకమిటీ సోమవారం ఉ.11.గంలకు అమరావతి సచివాలయంలో అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై నిర్వహించనుందని పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయం వెనుకవైపున ఇటీవల పి-4 కార్యక్రమం ప్రారంభించిన ప్రాంతంలోనే ప్రధాని కార్యక్రమ సభా వేదికను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రధాని పర్యటన మే 2వ తేదీకి నిర్ధారణ) అయిందని అయితే ఆ కార్యక్రమం ఉదయం నిర్వహించాలా లేక సాయంత్రం నిర్వహించాలా అనేది ఖరారు కావాల్సి ఉందని అన్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించి విస్తృతమైన కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాల్సి ఉందని అందుకు సంబంధించి ఆయా శాఖల అధికారులకు గురువారం తగిన ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇటీవల కాలంలో విశాఖలో జరిగిన ప్రధాని పర్యటన కార్యక్రమంలో విధులు నిర్వహించిన అధికారులకు ఈసారి కూడా తగిన విధులు కేటాయించడం జరుగుతుందని ఆ అధికారుల జాబితాను సిద్ధం చేయాలని సిఎస్ విజయానంద్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వేసవి దృష్ట్యా ప్రధాని పర్యటనకు వచ్చే ప్రజా ప్రతినిధులు,ప్రజలు తదితరు లెవరికీ ఎలాంటి అసౌకర్యం కలగని రీతిలో కనీస సౌకర్యాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తగిన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని సిఎస్ విజయానంద్ అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యంగా వివిధ గ్రామాల మీదగా ప్రముఖులు,సాధారణ ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకోవాల్సి ఉందని ఆయా రోడ్లన్నీ గ్రామీణ రహదారులై ఉన్నందున ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు తలత్తకుండా తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందని చెప్పారు. మొత్తం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేందుకు వైద్య ఆరోగ్య కుంటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండ్యన్ ను నోడలు అధికారిగా నియమించడం జరిగిందని కావున అధికారులు అందరూ ఆయనతో సమన్వయం చేసుకుని తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని సిఎస్ విజయానంద్ అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ ప్రధాని పర్యటనలో పాల్గొనే విఐపిలు,ఇతర ప్రముఖుల వివరాలను పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. సాధారణ పరిపాలన శాఖ ద్వారా ఆయా శాఖల అధికారులు చేయాల్సిన ఏర్పాట్లు ఇతర అంశాలకు సంబంధించి తగిన మార్గదర్శకాలను జారీ చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రధాని పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ నోడలు అధికారిగా నియమించబడిన వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ మాట్లాడుతూ సచివాలయం వెనుక వైపున పి-4 కార్యక్రమం జరిగిన ప్రాంతంలో ప్రధాని సభావేదిక ఏర్పాటు చేయడం జరుగుతుందని అక్కడి నుండే ప్రధాని మోడి పలు పనులకు ప్రారంభోత్సవాలు,శంఖుస్థాపనలు చేయను న్నారని వివరించారు. ప్రధాని సభలో సుమారు 5లక్షల మంది ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేయనున్నామని ప్రధాన వేదిక వద్ద 50వేల మంది కూర్చునే విధంగాను,మరో లక్షల మంది రోడ్లు వెంబడి నిలబడి ప్రధానికి స్వాగతం పలికే విధంగా,మిగతా వారు వివిధ ప్రాంతాల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. విఐపిలు,ప్రజలు తదితరులు సభా ప్రాంగణానికి చేరుకునేలా 9 రహదార్లను గుర్తించడం జరగిందని ఆయా రహదార్లలో ఎక్కడా ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా తగిన తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందని అన్నారు. ఉమ్మడి కృష్ణా,గుంటూరు,ఏలూరు,ప్రకాశం సమీప జిల్లాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు ప్రధాని సభలో పాల్గోనేలా మిగతా జిల్లాల నుండి తగిన విధంగా పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు వీరపాండ్యన్ తెలిపారు. ఈసమావేశంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఐజి హరి నారాయణ,సిఆర్డిఏ అదనపు కమీషనర్లు నవీన్,సూర్య ప్రవీణ్,ప్రోటోకాల్ అదనపు డైరెక్టర్ మోహన్ రావు తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే వర్చువల్ గుంటూరు,ఎన్టిఆర్,కృష్ణా జిల్లాల కలక్టర్లు,వివిధ శాఖాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

## వీరేశలింగం ఆశయ సాధనకు పునరంకితమవ్వాలి

**కందుకూరి 177 వ జన్మ దిన వేడుకల్లో పాల్గొన్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఆదిరెడ్డి అప్పా రావు**

**జన్మగృహ అభివృద్ధికి ఎంపీ లాడ్స్ నుంచి రూ 30 లక్షలు ఎంపీ ప్రకటన**

**పూర్వ విద్యార్థుల తరపున అభివృద్ధికి సహకరించాలని ఎంపీ సూచన.**



రాజమండ్రి ఏప్రిల్ 16 మనం బ్యూరో ఆనాడు సమాజంలో ఉన్న రుగ్మతలను రూపు మాపడానికి సంస్కరణలు తెచ్చిన నవ యుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు ఆశ యసాధనకు పునరంకితమ వ్వాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, అన్నారు. బుధవారం స్థానిక ఆనంద్ గార్డెన్స్ లో సంఘ సంస్కర్త వీరేశలింగం పంతులు 177వ జయంతి సందర్బంగా వీరేశలింగం, రాజ్యలక్ష్మి దంపతుల విగ్రహాలకు ఉదయం పూలమాలలు వేసి, సమాధుల వద్ద భక్త్యంజలి ఘటించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ మహిళల పట్ల ఆరోజుల్లో కొనసాగుతున్న వివక్షతను వీరేశలింగం పంతులు గుర్తించి మహిళల అభ్యున్నతికి పాటుపడ్డారని అన్నారు. ఒక దేశం ప్రగతి సాధించడం ఆ దేశ మహిళల సాధికారత పై ఆధారపడి ఉందని, వివేకానంద స్వామి చెప్పడం జరిగిందని, అందుకు కోసం కృషి చేసిన కందుకూరి వీరేశలింగం మనందరికీ ఆదర్శ ప్రాయుడు అన్నారు. ముఖ్యంగా వితంతు పునర్వివాహం జరిపించి సంఘంలో సంస్కరణ తెచ్చారని, మహిళలను విద్యా వంతులను చేయడానికి విద్యా సంస్థలను పెట్టారని ఆమె పేర్కొన్నారు. మహిళల పట్ల ఈ రోజుల్లో కూడా కొన్ని విషయాల్లో వివక్షత కొనసాగుతోందని ఆమె పేర్కొంటూ, వీరేశ లింగం స్ఫూర్తితో అయన ఆశయ సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అదే ఆ మహనీయుని ఆశయ సాధనకు మనం పునరంకితం అవుదామని పిలుపు ఇచ్చారు. వీరేశలింగం జన్మగృహం అభివృద్ధికి ఎంపీ లాడ్స్ నుంచి రూ.30 నుంచి రూ.35 లక్షల మేర కేటాయించనున్నట్లు ఎంపీ ప్రకటించారు. వీరేశలింగం స్మృతి వనం అభివృద్ధి కోసం రూ.50 లక్షల అంచనా వేశారని , శాఖ పరంగా రూ.15లక్షల మాత్రమే ఇవ్వడం జరుగుతోందని, మిగిలిన మొత్తం ఎంపీ ల్యాండ్ నుంచి నిధులు కేటాయించనున్నట్లు ఆమె వివరించారు. అన్నీ ప్రభుత్వమే చేయాలంటే వీలుపడదని, అందుకే పూర్వ విద్యార్థులం తామంత తాముగా ముందుకొచ్చి, వీరేశలింగం సంస్థల అభివృద్ధికి సహకరించాలని ఎంపీ పురందేశ్వరి కోరారు. దీంతో పూర్వ విద్యార్థి సిహెచ్ సీతారామ నాయుడు స్పందిస్తూ పది వేల రూపాయల విరాళం ప్రకటించారు. పూర్వ విద్యార్థి , జిల్లా బిజెపి అధ్యక్షుడు ఫిక్కి నాగేంద్ర స్పందిస్తూ, 2003- 06 బ్యాచ్ తరపున రూ 2 లక్షల సేకరించి ఇవ్వగ లనని ప్రకటించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఆ రోజుల్లో సంఘంలో ఉన్న రుగ్మతలపై గుర్తించి, వాటిని రూపుమాపేందుకు స్పందించిన వ్యక్తులుగా కందుకూరి వీరేశలింగం, టంగుటూరి ప్రకాశం సదా స్మరానియులన్నారు. వాటిని రూపుమాపేందుకు పనిచేశారని అన్నారు. కొన్ని విద్యాసంస్థల్లో ఇప్పటికీ చిన్నారు లపై జరుగుతున్న వేధింపుల గురించి వింటున్నామని, వీటిని రూపు మాపడానికి వీరేశలింగం వంటి మహనీయులు సూచించిన మార్గాన్న నడవడం లో వారిని స్ఫూర్తిని తీసుకుని పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సి ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ విటి కాలేజీలో స్టాటిస్టిక్స్ లెక్చరర్ గా సేవలందించిన తనకు వీరేశలింగం సంస్థలతో చిరస్మరణీయమైన అనుబంధం ఉందన్నారు. హితకారిణి సమాజం అధ్యక్షులుగా పని చేసినపుడు హితకారిణి ఆస్తు ల ఆదాయం పెంపు కోసం కృషి చేయడంతో పాటు వీరేశలింగం విద్యాసంస్థల అధ్యాపకు లు, సిబ్బంది జీతాల పెంపు చేయించానని, ఇక్కడి సమా ధులను అభివృద్ధి చేశామని ఆయన గుర్తుచేస్తూ కున్నారు. ఈ సంఘం అభివృద్ధి కోసం ఏ సమస్య ఉన్నా సరే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. హితకారిణి సమాజంఈ కార్యక్రమంలో ఈవో జె వినోద్ కుమార్, మాజీ అధ్యక్ష కార్యదర్శులు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, నాట్యాచార్య సప్పా దుర్గా ప్రసాద్, బళ్ళా శ్రీనివాస్, కూటమి నాయకులు బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, అనుశ్రీ సత్యనారాయణ, వై. శ్రీనివాస్, కాశీ నవీన్ కుమార్, ఎపిఆర్ చౌదరి, విటి విద్యాసంస్థల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు వీరేశలింగం దంపతుల సమాధులకు నివాళులర్పించారు.



## ప్రముఖ సంఘ సంస్కర్త, రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు గారి 177 వ జయంతి

ప్రముఖ సంఘ సంస్కర్త, రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు గారి 177 వ జయంతి సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర, టీవీ మరియు నాటక రంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు నాటక రంగ దినోత్సవం-2025 సందర్భంగా ఉత్తమ ప్రజా సంబంధాల అధికారిగా గుర్తిస్తూ ఏపీ ప్రభుత్వంచే ఘన సన్మానం

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**సిఐ రాంబాబు**



భీమవరం ఏప్రిల్ 16 మనం న్యూస్ :యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు వాడితే జీవితం అంధకారమవుతుందని పోలీస్ ఈగల్ సంస్థ సిఐ రాంబాబు అన్నారు. భీమవరం కేజీఆర్ఎల్ డిగ్రీ కళాశాలలో ఈగల్ సంస్థ ఆధ్వర్యంలో మత్తు పదార్థ రహిత సమాజంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సిఐ రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, యువత మత్తు మందు వాడడం వలన శరీరంలో తెలియని మార్పులు చోటు చేసుకొంటాయన్నారు. యువత విద్యార్థి దశలోనే మత్తుకు బానిస అవుతారని తెలిపారు. పీజీ కళాశాల డైరెక్టర్ డా కవల నాగేశ్వరరావు, కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి అరేటి ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలపై అవగాహ పెంచుకొని గ్రామాల్లోని ప్రజలకు వాటి పరిస్థితి గురించి వివరించాలన్నారు. ఈగల్ ఎన్ జీవో చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం మాట్లాడుతూ వ్యసనాలకు బానిసలుగా కారాదని, ఎక్కడైనా డ్రగ్స్ విషయం తెలిసిన తక్షణమే సమాచారం ఇస్తే తప్పక చర్యలు తీసుకుంటామన్నారు.

## ద్వారపూడిలో ఘనంగా మర్రెడ్డి కుమారుడు వివాహ వేడుకలు





గొల్లప్రోలు ఏప్రిల్ 16 మనం న్యూస్, ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లావస్త్రవ్యాపారాలకు ప్రసిద్ధిగాంచిన ద్వారపూడి లో పిఠాపురం జనసేనపార్టీఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరా వు కుమారుడులక్ష్మణ స్వామి డాక్టర్ నీలిమ సింధు దంపతుల వివాహ వేడుకలకు పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలుజనసేనపార్టీనాయకుడుపిల్లా శివశంకర్ బసా చిట్టిబాబు చిట్టిబాబుమిడాలసూరిబాబు కడారి కమ్మయ్య నాయుడు పర్ల రాజా ఆధ్వర్యంలో గొల్లప్రోలు మండలం నుండి మర్రెడ్డి కుమారుడు వివాహ వేడుకలకు ప్రముఖులు జనసేన పార్టీ నాయకులు కూటమి సభ్యులు జనసైనికులు వీర మహిళలు పెద్ద ఎత్తున ద్వారపూడి కేతలిసత్యనారాయణ రెడ్డి కళ్యాణ మండపానికి మంగళవారం రాత్రి చేరుకున్నారు గొల్లప్రోలు పిఠాపురం యు కొత్తపల్లి మండలాల నుండి జనసేన పార్టీ కార్యకర్తలు మర్రెడ్డి మిత్ర మండలి సభ్యులు ప్రముఖ పారిశ్రామికవేత్తలు రాష్ట్రబిజెపిఅధ్యక్షురాలుదగ్గుపాటి పురందేశ్వరి అనపర్తి నియోజకవర్గం శాసనసభ్యులునల్లిమిల్లిరామకృష్ణారెడ్డి కాకినాడ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షు డు,టిడిపినాయకుడుపేకెటీ నాగేశ్వరరా వు.దండువీరబాబుపేకేటి సుబ్రహ్మణ్యం పిఠాపురం తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు రెడ్డం భాస్కరరావు తలారి శ్రీనివాసరావు అనిశెట్టి సూరిబాబు అరిపి శ్రీను చిన్న బ్రదర్స్ కాకినాడ జిల్లా పరిషత్ సీఈవో వివిధ శాఖల అధికారులు పలువురు జర్నలిస్టులు తధితరులు వివాహ వేడుకల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు,,

## ఏఎస్ఆర్ చౌదరి ఫౌండేషన్

## ఆధ్వర్యంలో పిహెచ్ సి కి ఆసుపత్రి పరికరాలు వితరణ..



పోలవరం ఏప్రిల్ 16(మనం న్యూస్): పోలవరం మండలం ఎల్ఎన్ డి పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అల్లూరి సర్వారాయుడు చౌదరి ఫౌండేషన్ నవభారత్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం ఆసుపత్రి పరికరాలను బహుకరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ పిఆర్ఓ రాఘవరావు మాట్లాడుతూ ఏజెన్సీ మారుమూల ప్రాంతంలో గిరిజనులకు,రైతులకు వైద్య సేవలు అందిస్తున్న ఎల్ ఎన్ డి పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రికి ఐదు లక్షల



యాభై వేల విలువచేసే ఆసుపత్రి వస్తువుల పరికరాలను ఏఎస్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుకరించడం జరిగిందని అన్నారు. ఆసుపత్రికి వచ్చే పేషంట్ల కోసం రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండిషనర్, ఏవో ప్లాంట్ వాషింగ్ మిషన్, మూడు సీట్ల కుర్చీలు, రివాల్వింగ్ కుర్చీలు, ఆఫీసు టేబుళ్లు,నాలుగు దశల ఇనుప రాక్స్, పోర్టబుల్ చూషణ యంత్రం, పోర్టబుల్ ఫ్యూమిగేషన్ మిషన్,ఎక్సరే వీక్షణ పెట్టె,వార్డ్ రోబ్, చక్రాల కుర్చీ, కంప్యూటర్లు అందజేశామన్నారు. జంగారెడ్డిగూడెం,కొయ్యలగూడెం పరిసర ప్రాంతాల రైతుల కొరకు ఇప్పటివరకు నలభై లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టమని, భవిష్యత్తులో ఈ ప్రాంత ఆయిల్ ఫామ్ రైతుల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఏజెన్సీ మారుమూల ప్రాంతాలకు వచ్చి గిరిజనులకు,రైతులకు సేవలు చేస్తున్న పీహెచ్సీ వైద్యుల సేవలు అభినందనీయమని అన్నారు. రైతులు కొల్లూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ప్రాంత ఆయిల్ ఫామ్ రైతులకు ఏఎస్ఆర్ ఫౌండేషన్ నవభారత్ నిర్వాహకులు వ్యవసాయంలో సహాయ సహకారాలు అందిస్తూ, రైతులు అభివృద్ధి చెందడానికి ప్రోత్సాహం చేస్తున్నారని అన్నారు. ఏఎస్ఆర్ ఫౌండేషన్స్ మారుమూల గిరిజన ప్రాంతంలో సామాజిక సేవలు అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు కె. నవీన్, టి. సుష్మ, ఆయిల్ ఫామ్ రైతులు కొల్లూరు శ్రీనివాస రావు, నవభారత్ ఇండియా సిబ్బంది, రైతులు, గ్రామస్తులు హాజరయ్యారు.

## టిడ్కో ఇల్లు జూలై నాటికి ఇవ్వడానికి సిద్ధం

**మున్సిపల్ కమిషనర్ విజయ సారథి వెల్లడి**



పాలకొల్లు, ఏప్రిల్ 16,మనం ప్రతినిధి :పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో టిడ్కో ఇల్లు ఈ ఏడాది జూన్ నెలలో గాని,జూలై నెలలో గాని లబ్ధిదారులకు అప్పగించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ మేరకు ఇక్కడ ఏర్పాటు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పాలకొల్లు మున్సిపల్ కమిషనర్ బి విజయ సారథి వెల్లడించారు. పాలకొల్లులో బుధవారం ఆయన ఛాంబర్ లో మాట్లాడారు. గతంలో 2800 ఇల్లు లబ్ధిదారులు కు అప్పగించారని ఇప్పుడు మళ్లీ 3, 000 ఇల్లు లబ్ధిదారులకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పెయింటింగ్ పనులు, విద్యుత్తు, ప్లంబింగ్ పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 8కోట్ల 27 లక్షలు రూపాయల ఆస్తి పన్ను వసూలు చేసినట్టు తెలిపారు. ఇది గత ఏడాది కంటే రెండున్నర కోట్లు రూపాయలు అధికమని తెలిపారు. పట్టణంలో కుక్కల సమస్యలను పరిష్కరించడానికి పశువుల ఆసుపత్రిలో సంతాన ఉత్పత్తి లేకుండా శస్త్ర చికిత్సలు చేయడానికి తగిన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. అలాగే పశువుల సమస్యను పరిష్కరించడానికి త్వరలోనే పశువుల షెడ్డు ఏర్పాటు చేసి ఆ సమస్యను కూడా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ విజయ సారథి వివరించారు.

## క్రైస్తవుల శాంతి పాదయాత్ర



మైలవరం ఏప్రిల్ 16 మనం న్యూస్:స్థానిక శాంతినగర్, నందు గల ఆర్సీయం విచారణ దేవాలయము నుంచి ప్రపంచ శాంతి కోరుతూ క్రైస్తవులు చెవుటూరు కలువరి గిరి కొండ సిలువ వద్దకు పాద యాత్ర జరిపించారు. విచారణ గురువు అనీల్ ఫ్రాన్సిస్ మాట్లాడుతూ, స్థానిక విచారణ పరిధిలో 16 సంఘాలలో 40 రోజుల తపస్సుకాల ప్రార్థనలు జరిపిస్తూ చివరి



గ్రామముగా ఈ రోజు చేవుటూరు లో ముగింపుగా 16 సంఘముల ప్రజలు, మైలవరం నుంచి చెవుటూరు లోని కలువరి కొండ వరకు ప్రపంచం శాంతి ని కా%శీ%క్షిస్తూ, ప్రస్తుతం లోకంలో ప్రజలందరూ హింసలు, చెడు నడత, పాపపు మార్గంలో జీవిస్తూన్నారని, ప్రభువైన యేసు క్రీస్తు వారు సిలువ మరణం ద్వారా, పొరుగువారిని ప్రేమించాలని, ఐకమత్యం తో బతకాలని కోరుతూ శాంతి ర్యాలీ నిర్వహించమని, తెలిపారు, అతిధి గురువు, జయరాజు దివ్యపూజాబలి, దివ్య సప్రసాద ఆరాధన జరిపించారు, వచ్చిన భక్తులకు, చెవుటూరు యూత్, సంఘస్తులు ప్రేమవిందు ఏర్పాటు చేసారు, ఈ కార్యక్రమం లో స్థానిక సంఘ కాపరి, ఎన్. సింహారాయులు, ఉపదేశకులు, లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్ సిస్టర్స్, దీక్షాపరులు, మరియదళ సభ్యులు, సంఘపెద్దలు, మదర్ తేరీసాయూత్, 16 సంఘాల విశ్వాసులు సుమారుగా 600 మంది పాల్గొన్నారు.

# ప్రజా దర్బారులో వచ్చిన ప్రతి సమస్య పరిష్కరించేందుకు కృషి

**పెనుగంచిప్రోలు లో ప్రజా దర్బార్ లో పాల్గొన్న**

**శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య**



పెనుగంచిప్రోలు ఏప్రిల్ 16 మనం న్యూస్ప్రజా దర్బారులో వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖలకు పంపి దాని పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. బుధవారంపెనుగంచిప్రోలు లో పాత సినిమా హాల్ సెంటర్ జమ్మిచెట్టు సెంటర్ రామాలయం వద్ద గల ఫంక్షన్ హాల్ నందు ప్రజాదర్బార్ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంలో వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ఏర్పాటైన ప్రజాదర్బార్ ముఖ్యమంత్రి ఆలోచన అని దీని ద్వారా ప్రజల యొక్క సమస్యలు అర్జీ రూపంలో ఇవ్వడం వాటిని సంబంధిత విభాగాల అధికారులకు పంపడం జరుగుతుందని ప్రతి ఒక్కరి సమస్య కూడా త్వరితగతిన పూర్తయ్యే విధంగా చూస్తామని ఎమ్మెల్యే రాజగోపాల్ హామీ ఇవ్వడం జరిగింది.

**ప్రజాదర్బార్లో మొత్తం సమస్యలు 112 రాగా**

1. రెవిన్యూ విభాగంలో 33
2. పెన్షన్లు 24
3. స్థలాలు 26
4. రేషన్ కార్డులు 8
5. ఇతర సమస్యలు 21

రావడం జరిగిందని ప్రతి ఒక్క సమస్యను అనుకున్న సమయంలో పూర్తి అయ్యే విధంగా చూస్తామని తెలిపారు.

బిఇంతే కాకుండా ప్రతి గ్రామం నుండి కూడా వారి యొక్క గ్రామ అభివృద్ధి చేయాలని డ్రైన్లు, సిసి రోడ్లు, డొంక రోడ్లు, స్మశాన వాటికలు, కంప చెట్లు తొలగించడం,కరెంట్ సమస్యలు,యువత ప్లేగ్రౌండ్, పెనుగంచిప్రోలు గుడి దగ్గర రోడ్డు తుఫాన్ కాలనీలో సైడ్ డ్రైన్ లు,పోలీస్ స్టేషన్ దగ్గర టాయిలెట్లు ఇంకా ఇతర సమస్యలు ఉన్నవని వాటిని త్వరితగతిన పరిష్కారం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో పలువురు తెలుగుదేశం నేతలు ప్రముఖులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఛార్జీలు పెంచితే విద్యుత్ ఉద్యమం మళ్లీ పునరావృతం

- కారం భాస్కర్ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పోలవరం..
- కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం అమలు చేయాలి.
- స్మార్ట్ మీటర్లు బిగింపు నిర్ణయం విరమించుకోవాలి.
- సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన..






పోలవరం,ఏప్రియల్ 16(మనం న్యూస్): రాష్ట్ర కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులపై భారాలు మోపడం దురదృష్టకరమని సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. బుధవారం మండలం లోని పోలవరం విద్యుత్ ఉప కేంద్రంవద్ద సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.ఎన్నికల హామీలు అమలు చేయాలనీ, ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించొద్దని, విద్యుత్ చార్జీలు పెంచొద్దని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని, నాణ్యమైన కరెంట్ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలల కాలంలో ఇష్టారాజ్యంగా కరెంట్ చార్జీలు పెంచడం బాధాకరం అన్నారు.దపదపాలుగా విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులు,చిరు వ్యాపార,పరిశ్రమలపై భారాలు మోపడం ఈ కూటమి ప్రభుత్వంకు సబబు కాదన్నారు.ట్రూ అఫ్ చార్జీలు,సర్ చార్జీలు,ఇందన సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు అంటూ ధరలు పెంచడం కూటమి ప్రభుత్వంకు తగదన్నారు.విద్యుత్ భారాలతో పాటు స్మార్ట్ మీటర్లు బిగింపు మరింత అందగారంలోకి నెట్టివేస్తుందన్నారు.అదానితో గత ప్రభుత్వం కుదుర్చుకున్న సెకి ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.వేసవి దృష్టిలో ఉంచుకొని విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలనీ డిమాండ్ చేశారు.గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగిండాన్ని ప్రతీ ఒక్కరు వ్యతిరేకించాలని అన్నారు.ప్రభుత్వం ఇష్టా రాజ్యంగా విద్యుత్ చార్జీలు పెంచితే మళ్ళీ విద్యుత్ ఉద్యమం పునరావృత అవుతుందని హెచ్చరించారు. అనంతరం ప్రభుత్వ హామీని అమలు చేయాలని కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు బొరగం భూ చంద్రరావు,మడివి చలపతిరావు, గోకూరి పాండవులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీలతో 16 వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, సభ్యుల సమావేశం



విజయవాడ ఏప్రిల్ 16 మనం బ్యూరో రాష్ట్ర పర్యటనకు వచ్చిన 16 వ ఆర్థిక సంఘం ఛైర్మన్ డా. అరవింద్ పనగారియా, సభ్యులు డా. మనోజ్ పాండా, అన్నే జార్జ్ మాథ్యూ లతో వివిధ రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను బుధవారం నోవాటెల్ హెూటల్ లో వారితో జరిగిన ముఖాముఖి సమావేశంలో తెలియజేశారు.. తెలుగుదేశం పార్టీ ప్రతినిధులుగా శాసనమండలి సభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ వి. చిరంజీవి రావు, మాజీ శాసనమండలి సభ్యులు పి. అశోక్ బాబు లు మాట్లాడుతూ 15 వ ఆర్థిక సంఘం రాష్ట్రానికి నిధులు కేటాయించడంలో రాష్ట్ర రెవెన్యూ లోటు ను పరిగణలోకి తీసుకుందన్నారు. 16 వ ఆర్థిక సంఘం కూడా రెవెన్యూ లోటు ను పరిగణలోకి తీసుకోవాలన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఉన్న ఆర్థిక క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. సెక్టార్ల వారీగా గ్రాంట్స్ ను విద్య, ఆరోగ్య రంగాలకు అందివ్వాలన్నారు. దేశంలో రాజధాని లేని రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అనే విషయం గుర్తించాలన్నారు. పాపులేషన్ లెక్కలను కూడా 1971 జనాభా లెక్కల ప్రకారంగా సిఫార్సులు ఉంటే రాష్ట్రానికి మంచి జరుగుతుందన్నారు. పాపులేషన్ గ్రోత్ రేట్ ఆధారంగా నిధులు పంపకాలు ఉండాలన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ వాటా పెంచాలన్నారు. రాష్ట్రంలో వెనుకబడి ఉన్న ప్రాంతాలకు నిధులు పెంచాలన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్య రంగాలకు ప్రత్యేక నిధులు అందించాలన్నారు. జనసేన పార్టీ ప్రతినిధులుగా శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, బొలిశెట్టి శ్రీనివాస్ లు మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్రానికి వెనుకబడిన రాష్ట్రాలకు ఇచ్చే విధంగా ఆర్థిక సాయం అందించాలని కోరారు. వెనుకబడిన రాష్ట్రాల జాబితాలో రాష్ట్రాన్ని చేర్చి ఆర్థికంగా చేయూతను అందించాలన్నారు. స్థానిక సంస్థల బలోపేతానికి చేయూతను అందించాలన్నారు. రాష్ట్రంలో రోడ్లు చాలా వరకు ఇబ్బందికరంగా ఉన్నాయని వాటి అభివృద్ధికి నిధుల సాయం చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న 972 కిమీ కోస్టల్ లైన్ అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్రానికి 90 శాతం గ్రాంటు గా నిధులు అందించాలన్నారు. త్రాగు నీరు, రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని నగర, గ్రామ



పంచాయతీలను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. వాటర్ వర్క్స్ నిధులు, జలజీవన్ మిషన్ ఫండ్స్ రాష్ట్రానికి ఇవ్వాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వర్క్స్ కు నిధులు పెంచాలన్నారు. వైసీపీ పార్టీ ప్రతినిధులుగా మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మరియు కృష్ణ లు మాట్లాడుతూ గతంలో జనాభా, ప్రాంతాల అభివృద్ధి ఆధారంగా నిధులు అందించారన్నారు. రాష్ట్రంలో కోవిడ్ ఉన్నా కూడా వివిధ సంక్షేమ పథకాలు, కులాలకు, మతాలు, పార్టీ లకు అతీతంగా ఇచ్చామన్నారు. రాష్ట్రాలకు పన్నుల వాటాలో 50 శాతం నిధులు అందించాలన్నారు. పన్నుల వాటాలో ప్రత్యేక బోనస్ కూడా ఇవ్వాలన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు రావాల్సిన పన్నుల వాటాల్లో రాష్ట్రాలకు న్యాయం చేయాలి.. 14 వ ఆర్థిక సంఘంలో డాక్టర్ వైవీ రెడ్డి ఉన్నప్పుడు రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పన్నుల వాటాను తొలిసారిగా 32 శాతం నుంచి 42 శాతం వరకు పెంచుతూ సిఫార్సు చేశారు. ఆ తర్వాత 15 వ ఆర్థిక సంఘం డాక్టర్ ఎన్కె సింగ్ ఉన్నప్పుడు 41 శాతం ఇచ్చారన్నారు. బీజేపీ పార్టీ ప్రతినిధులుగా మరియు 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్, బిజెపి ఎంఎల్ఏ ఆదినారాయణ రెడ్డి లు మాట్లాడుతూ గత ప్రభుత్వం లో రాష్ట్రంలో అభివృద్ధిలో దారుణమైన డిజాస్టర్ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు పెంచాలన్నారు. 14 వ ఫైనాన్స్ కమిషన్ ఇచ్చిన నిధులు కన్నా 15 వ ఫైనాన్స్ కమిషన్ ఇచ్చిన నిధులు తక్కువగా ఉన్నాయని అవి ఎందుకు తగ్గుతున్నాయో పరిశీలించి సరిచేయాలన్నారు. రాష్ట్రానికి ఉన్న తీర ప్రాంతం ద్వారా ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి సాధించవచ్చు. రాష్ట్రంలో రంగాల వారీగా నిధులు పెంచాలి.. ప్రకాశం జిల్లాలో ఫ్లోరైడ్ ఉన్న ప్రాంతాల్లో నిధులు పెంచాలి.. నాచురల్ ఫార్మింగ్ కు రాష్ట్రంలో ప్రాముఖ్యత పెరుగుతుందని ప్రాధాన్యత కల్పించాలి. రోడ్లకు ఫండింగ్ ఇవ్వాలి. రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా ఇళ్ల నిర్మాణం ఉన్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. సిపిఎం నేతలు వెంకటేశ్వరరావు, బాబురావు లు మాట్లాడుతూ ఏపీకి స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని కోరుతున్నామన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ను కేంద్రం నిధులతోనే నిర్మాణం పూర్తి చేయాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేసి అభివృద్ధికి చేయూత నందించాలన్నారు. బీఆర్ అంబేద్కర్ ఆశయాల మేరకు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను కేటాయించాలన్నారు. బుందేలు ఖండ్ తరహాలో వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక నిధులను కేటాయించాలన్నారు. విపత్తులను, వరద బాధితులను ఆదుకునేందుకు కేంద్రం నిధులను అందించాలన్నారు.. రాష్ట్రాలకు కేంద్రం ఇచ్చిన రుణాలు పెరిగిపోతున్నాయని ఆ రుణాలను మాఫీ చేయాలన్నారు. నిధులు లేక గ్రామీణ ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించలేకపోతురన్నారు.. కడప స్టీలు ప్లాంటు ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలన్నారు. అమరావతి నిర్మాణానికి నిధులు రుణ రూపంలో కాకుండా గ్రాంటు రూపంలో అందివ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులుగా మాజీ శాసనసభ్యులు షేక్ మస్తాన్ వలి, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి లు మాట్లాడుతూ రాష్ట్రానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వము విడుదల చేయవలసిందిగా కోరుతున్నామన్నారు. స్థానిక సంస్థలకు ఇచ్చేటటువంటి గ్రాంట్లు విడుదల చేయాలి. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సంబంధించిన పునరావాసము మరియు పరిహారానికి నిధులు, నిర్మాణంలో జాప్యాన్ని నివారించాలి.. 16 వ ఫైనాన్స్ కమిషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వాలని అదేవిధంగా విభజన చట్టం ఇచ్చినటువంటి వాగ్దానాలకు సంబంధించినటువంటి అన్ని నిధులను విడుదల చేయాలి.. రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి స్థానిక సంస్థలకు ఇవ్వాల్సినటువంటి నిధులను అందివ్వాలి. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు ను త్వరితగతిన పూర్తి అయ్యేలా నిధులు అందివ్వాలన్నారు.ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధులు నేతి ఉమామహేశ్వరరావు, బాలసుబ్రహ్మణ్యం లు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి 16 వ ఆర్థిక సంఘం తమ తోడ్పాటును అందించాల్సిన అవసరం ఉందన్నారు. రెవెన్యూ లోటును తగ్గించడంలో కేంద్ర నిధులు అవసరం రాష్ట్రానికి ఎంతైనా ఉందన్నారు. పోలవరం, ఇరిగేషన్ లాంటి ప్రాజెక్టుల పూర్తికి రాష్ట్రానికి నిధులు కేటాయించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వాలి కోరామన్నారు.

# మంత్రి నిమ్మల కృషి తోనే

**పూలపల్లి అభివృద్ధికి ఉపాధి హామీ పనులు**

**మండల టీడీపీ అధ్యక్షులు విజయ్ భాస్కర్**



పాలకొల్లు, ఏప్రిల్ 16,మనం ప్రతినిధి :పూలపల్లి అభివృద్ధికి రూలక్షల్లో జరిగే ఉపాధి హామీ పనులు దోహద పడనున్నాయని టిడిపి పాలకొల్లు మండల అధ్యక్షుడు కోడి విజయ భాస్కర్ తెలిపారు. గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పనులపై జరిగిన సభలో ఆయన మాట్లాడారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో ఉపాధి హామీ పనుల కింద రూపాయి పని కూడా జరగలేదని దీనివలన గ్రామంలో అభివృద్ధి పూర్తిగా నోచుకోలేదని భాస్కర్ రావు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు మంత్రి రామానాయుడు చొరవతో పెద్ద ఎత్తున లక్షలాది రూపాయలు నిధులు రాబోతున్నాయి అన్నారు. నాయకులు వేగేసిన శ్రీహరి రాజు మాట్లాడుతూ మంత్రి రామానాయుడు ఇప్పటికే గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులు కోసం నిధులు ఇచ్చారని భవిష్యత్తులోనూ మరిన్ని పనులు జరుగుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ పాలా శ్రీనివాస్ నాయకులు గోనెడ రామకృష్ణ, గుబ్బల హరిప్రసాద్ ,గబిడి నరసింహారాజు, పాలపర్తి చాంద్ రాజు, మాదాసు లలిత కుమారి, నాలం రఘు. పాముల రజిని కుమార్, ఇంటి శ్రీరాముడు, నీలం నారాయణమూర్తి, బోడపాటి కాశీ విశ్వనాథం, తదితర నాయకులు పాల్గొన్నారు.

## కోనసీమ జిల్లా నూతన డి.పి.టి.ఓ గా రాఘవకుమార్ పదవీ బాధ్యతలు స్వీకరణ



అమలాపురం ఏప్రిల్ 16 మనం ప్రతినిధి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏపీఎస్ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారిగా ఎస్.టి.పి రాఘవ కుమార్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కాకినాడ జిల్లా డి.పి.టి.ఓ ఎం.శ్రీనివాసరావు ప్రస్తుతం సంవత్సర కాలం నుంచి కోనసీమ జిల్లా ఇన్చార్జి డిపీటీవో గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న విషయము తెలిసినదే. ఈ మేరకు ఏపీఎస్ఆర్టీసీ హెడ్ ఆఫీస్ విజయవాడ లో సి.సి.ఓ.ఎస్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న రాఘవ కుమార్ కి కోనసీమ జిల్లా డిపిటిఓ గా బదిలీ రావడం వలన బుధవారం ఎం శ్రీనివాసరావు కోనసీమ జిల్లా డిపీటీవో బాధ్యతలను రాఘవ కుమార్ కి అందజేశారు. రాఘవ కుమార్ గ్యారేజ్ ఆవరణలో మొక్కనాటి ఇష్టపడి పని చేస్తే ఫలితాలు అద్భుతంగా ఉంటాయని సిబ్బందికి తెలియజేశారు. డిపిటిఓ శ్రీనివాసరావు అమలాపురం డిపో అన్ని పేరామీటర్లలో అభివృద్ధి పథంలో ఉందని ఇదే స్ఫూర్తి మునుముందు కొనసాగించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి, రావులపాలెం డిపో మేనేజర్, నాలుగు డిపోల సూపర్వైజర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం విక్రయస్తున్న వ్యక్తి అరెస్టు



భీమవరం ఏప్రిల్ 16 మనం న్యూస్ :పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం కొత్త పూసలమర్రు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయస్తున్నారని సమాచారంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మరియు వారి సిబ్బంది సోదాలు నిర్వహించగా కొల్లాటి పద్మనాభం అనే వ్యక్తి వద్ద 12 మద్యం సీసాలు స్వాధీన పరుచుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ బలరామ రాజు తెలిపారు. బెల్టు షాపులు పెట్టి అక్రమ మద్యం విక్రయాలు ఎవరైనా చేస్తే భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వారికి సెల్ నెంబర్ 9440902439 నెంబర్కు సమాచారం ఇవ్వాల్సిందిగా తెలిపారు. ఈ సోదాలలో ఇన్స్పెక్టర్ బలరామరాజు, ఎస్.ఐలు ఉమా మహేశ్వరరావు, సునీల్ కుమార్ మరియు వారి సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి నిమ్మల చొరవ తోనే లోవోల్టేజి సమస్య పరిష్కారం

**టిడిపి నేత పెచ్చెట్టి బాబు**



పాలకొల్లు, ఏప్రిల్ 16,మనం ప్రతినిధి :పాలకొల్లు పట్టణ పెద్ద గోపురం ప్రాంతంలో బుధవారం విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను కూటమి నాయకులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఈ ప్రాంతంలో లో వోల్టేజీ సమస్య వేధిస్తుందని, గత ప్రభుత్వం లో నాయకులు పట్టించుకోలేదని తెలిపారు. మంత్రి రామానాయుడు నియోజకవర్గంలో లో వోల్టేజీ సమస్య ఎక్కడ ఎక్కడ ఉందో స్వయంగా తెలుసుకొని పరిష్కార దిశగా అవసరమైనచోట్ల విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను కొత్తగా ఏర్పాటు చేస్తున్నారన్నారు. పాలకొల్లు నియోజకవర్గం మొత్తంమీద 99 ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారని బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడిఈ రామకృష్ణ, నాయకులు గండేటి వెంకటేశ్వర రావు ,ఉన్నమట్ల కబర్ది ,తుల రామ లింగేశ్వర రావు ,సిడగం సూరి , శ్రీకాకులపు వెంకన్న ,కర్నేన గౌరు నాయుడు , పిసిని రాము,ధనాని సూర్య ప్రకాష్ ,పోట్నూరి శ్రీనివాస్ ,బేరం శ్రీ రామ చంద్ర మూర్తి, మల్లంపల్లి ఫకీర్ బాబు ,సిడగం సత్యశ్రీనివాస్, గాది సుబ్బారావు, పర్యవేక్షకులు వాసు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఐఐటీ, యూనివర్సిటీ ఆఫ్ ఫ్యూచర్ లో అడ్మిషన్లు

**- మెరిట్ ఆధారంగా 100 శాతం స్కాలర్షిప్**





గాంధీనగర్ ఏప్రిల్ 16 మనం న్యూస్: గుజరాత్ లోని యూనివర్సిటీ ఆఫ్ ద ఫ్యూచర్, ఎన్ఐఐటీలలో అడ్మిషన్ల కోసం బుధవారం విజయవాడ కీ హోటల్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా దరఖాస్తు చేసుకునే వారు తాము ఇష్టపడే విభాగంలో ప్రవేశం పొందవచ్చని, వంద శాతం వరకు మెరిట్ ఆధారిత స్కాలర్షిప్ లను పొందవచ్చని యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ గోపాలన్ ప్రకాష్ తెలిపారు. ఉన్నత విద్యలో నూతన ఆవిష్కరణలను తీసుకురావాలనే లక్ష్యంతో యూనివర్సిటీ ఆఫ్ ది ఫ్యూచర్, ఎన్ఐఐటీ విశ్వవిద్యాలయం ప్రారంభించామని వివరించారు. ఇటీవల ఇంటర్ బోర్డు పరీక్షలకు హాజరైన 12వ తరగతి విద్యార్థులకు తాము అందించే కోర్సులు, ఫీజులు, స్కాలర్ షిప్ లపై అవగాహన కల్పించడానికి ప్రత్యేకంగా ఈ ఓపెన్ హౌస్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఏఐ అండ్ డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఐఓటి, ఆటోమేషన్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ బయోటెక్నాలజీ లో బి.టెక్,బీబీఎ, ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్లో డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్లలో భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రోగ్రామ్లను ఎన్ఐటీ విశ్వవిద్యాలయం అందిస్తుందని తెలిపారు. మహిళా విద్యార్థులకు ప్రత్యేక స్కాలర్షిప్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జేఈఈ స్కోర్లతో దరఖాస్తు చేసుకుని ఎంపికైన తర్వాత, మీకు నచ్చిన కోర్సులో అడ్మిషన్ పొందాలని విద్యార్థులకు ఆయన సూచించారు. అడ్మిషన్లు, ప్లేస్మెంట్ల గురించి పూర్తి సమాచారం కోసం లో లాగిన్ కావాలని కోరారు. అసోసియట్ ప్రొఫెసర్ అండ్, డీన్ ఆఫ్ అకాడమీ డాక్టర్ గణపతి రావు, సౌత్ రీజినల్ డైరెక్టర్ లతిక నాయర్ పాల్గొన్నారు..

## త్రాగునీటి క్లోరిన్ తనిఖీలు సక్రమంగా నిర్వహించాలి



యు.కొత్తపల్లి ఏప్రిల్ 16 (మనం న్యూస్) ఆర్డబ్ల్యూఎస్ రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామాలలో అందిస్తున్న త్రాగునీరు క్లోరిన్ తనిఖీల పై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించేందుకు గుజరాత్ నుండి నేషనల్ వాటర్ ఎక్స్పెర్ట్ పీటర్ ఆనంద్ థామస్ బాయ్ మూడు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు బుధవారం ఉప్పాడ, అమీనాబాద్, కొనపాపేట గ్రామాలలో పర్యటించి అక్కడ ప్రజలను రక్షిత మంచినీటి పథకం ద్వారా త్రాగునీరు ఎలా అందుతుందని అడిగి తెలుసుకున్నారు అనంతరం గ్రామ సచివాలయాల్లో అంగనవాడి, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు గ్రామాల్లో అందిస్తున్న త్రాగునీరు క్లోరిన్ శాతం ఏ విధంగా తనిఖీ చేయాలి. సచివాలయాల్లో ఉన్న త్రాగునీటి తనిఖీ కిట్లు ఏ విధంగా ఉపయోగిస్తున్నారు అడిగి తెలుసుకుని తనిఖీట్లపై అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలకు శుద్ధి చేసిన త్రాగునీరుపై అవగాహన కల్పించాలని సూచించారు ఈయన వెంట ఆర్డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, జెఈ రమణ, పంచాయతీ కార్యదర్శి ఆర్ఎస్ కుమార్, శ్రీనివాస్, అమీనాబాద్ సర్పంచ్ నక్క మణికంఠ తదితరులు ఉన్నారు

## నాగులపల్లి లో మజ్జిగ పంపిణీ



యు.కొత్తపల్లి ఏప్రిల్ 16(మనం న్యూస్)నాగులాపల్లి గ్రామంలో ఆటో స్టాండ్ వద్ద సిపిఎం పార్టీ యు.కొత్తపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో పేదల పెన్నిధి దక్షిణ భారత కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య స్మారక మజ్జిగ కేంద్రం బుధవారం ప్రారంభించారు. ఉచిత మజ్జిగ కేంద్రాన్ని నాగులాపల్లి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ అరుణోదయ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. మజ్జిగను అమ్మ స్కూల్ అధినేత పెనుమల్లు కృష్ణా రెడ్డి గారి ధాత్రుత్వం ద్వారా అలాగే కూలింగ్ వాటర్ బి. ఆంజనేయ రెడ్డి (విజయ్ ప్యూర్ వాటర్ అధినేత) సరఫరా చేయడం జరిగింది. వేసవికాలంలో నిరుపేదలు మజ్జిగ పంపిణీ చేయడం ఆనందకరమైన విషయమని తెలిపారు ఈకార్యక్రమంలో కాకినాడ జిల్లా సిపిఎం సభ్యులు సిహెచ్.రాజ్ కుమార్,మండల సిపిఎం నాయకులు జి.అప్పారెడ్డి, కె.నాగేశ్వరావు, కె.వి.వి.సత్యనారాయణ, జి.వి.సుబ్బిరెడ్డి, వి.సత్యనారాయణ, డి.సోమరాజు, ఎ.వాసు, ఎం.సూరిబాబు, లక్ష్మి, భవాని మరియు శివదుర్గ ఆటో యూనియన్ అధ్యక్షులు పల్లా రెడ్డి మొదలగువారు పాల్గొనడం జరిగింది

## ప్రోటోకాల్ రగడ బడ్జెట్ సమావేశం నుండి అధికార వైసీపీ సభ్యులు వాకౌట్

**అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదనే ఆరోపణలు.**



రావులపాలెం ఏప్రిల్ 16 మనం న్యూస్. రావులపాలెం మండల కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశం రసాభాసగా ముగిసింది. ఎంపీడీవో ఈ మహేశ్వర్ ఆధ్వర్యంలో సమావేశం ప్రారంభం కాగానే వైసీపీ కి చెందిన ఎంపీపీ కర్రి లక్ష్మి వెంకట నాగదేవి, జడ్పిటిసి కుదుపూడి శ్రీనివాసరావు, పలువురు ఎంపీటీసీ లు, సర్పంచులు అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయంలో జరిగే కార్యక్రమాలకు తమను తెలవడం లేదని ప్రోటోకాల్ పాటించకుండా అవమానిస్తున్నారని ఆరోపిస్తూ సమావేశం నుండి వాకౌట్ చేశారు. దీంతో సమావేశం రద్దయింది. ఎంపీడీవో మహేశ్వర మాట్లాడుతూ ప్రతి సమాచారాన్ని సభ్యులకు తెలియజేస్తున్నామని, ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రతినెల సమావేశాలు నిర్వహించడానికి సిద్ధమని అధికారులు తెలిపారు. అధికార పక్షం వైసీపీ సభ్యుల తీరును ప్రతిపక్ష టిడిపి సభ్యులు తీవ్రంగా ఖండించారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే సమావేశంలో వివాదం సృష్టించారని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో తహసిల్దార్ ముక్తేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో గొంగుల కృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా సమగ్రాభివృద్ధిలో లీడ్ బ్యాంకు కీలకపాత్ర

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



విజయవాడ ఏప్రిల్ 16 మనం ప్రతినిధిలీడ్ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ నూతన రీజనల్ మేనేజర్, ఎన్టీఆర్ జిల్లా డీసీసీ-డీఎల్ఆర్సీ కన్వీనర్ ఎంవీ తిలక్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం బుధవారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశను కలెక్టరేట్లో మర్యాదపూర్వకంగా కలిశారు.కలెక్టర్ లక్ష్మీశ.. నూతన కన్వీనర్కు శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా సమగ్రాభివృద్ధిలో లీడ్ బ్యాంక్ది కీలక పాత్ర అని.. డీసీసీ-డీఎల్ఆర్సీ కన్వీనర్గా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో చేరువచేయడంలో, వివిధ రకాల బ్యాంకు రుణాల మద్దతులోనూ సానుకూల దృక్పథంతో ముందడుగు వేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ కోరారు.కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.ప్రియాంక పాల్గొన్నారు.


## రెవెన్యూ సేవల దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిపెట్టాం

**సమస్యల సత్వర పరిష్కారానికి కృషిచేస్తున్నాం**

**క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం**

**రీసర్వే కార్యకలాపాలను లక్ష్యాలమేరకు వేగవంత చేస్తున్నాం**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



విజయవాడ ఏప్రిల్ 16 మనం ప్రతినిధి రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రెవెన్యూ సేవలకు సంబంధించిన దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, వివిధ అంశాలపై స్పష్టమైన అవగాహనతో సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషిచేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ (సీసీఎల్ఏ), ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హాజరయ్యారు. క్రమబద్ధీకరణ పథకానికి సంబంధించిన జీవో నెం.30 కింద అందిన దరఖాస్తులు, ఇళ్లు లేని పేదలకు ఇళ్ల నిర్మాణం, ఇటీవలి కలెక్టర్ల సదస్సులో గౌరవ ముఖ్యమంత్రివర్యుల ఆదేశాల అమలు కార్యాచరణ, భూ బదలాయింపులు, 22(ఏ) జాబితాలోని ప్రైవేటు భూములు, అసైన్మెంట్, ఆర్వోఆర్-వెబ్ల్యాండ్ సమస్యలు, రీసర్వే తదితర అంశాలపై సీసీఎల్ఏ జయలక్ష్మి మార్గనిర్దేశనం చేశారు. స్పష్టమైన ప్రణాళికతో రెవెన్యూ అంశాలపై దృష్టిసారించాలని ఆదేశించారు. వీసీలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇచ్చే మార్గదర్శకాలు, సీసీఎల్ఏ వారి సూచనలకు అనుగుణంగా రెవెన్యూ సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, క్షేత్రస్థాయి సిబ్బందికి ఆయా అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రీసర్వేకు సంబంధించి పైలట్ కింద 16 గ్రామాల్లో 77 ప్రత్యేక బృందాలు, 16 రోవర్ల సహకారంతో రీసర్వే జరిగిందని.. గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయినందున, తర్వాతి కార్యకలాపాల పూర్తికి కృషిచేస్తున్నామన్నారు. అదేవిధంగా రెండో దశలో 8 గ్రామాల పరిధిలోని 68 బ్లాకుల్లో 68 బృందాలు, 35 రోవర్లతో చేపట్టిన రీసర్వే కార్యకలాపాలను కూడా వేగవంతం చేస్తున్నామని, లక్ష్యాల మేరకు ప్రగతి చూపేందుకు ప్రయత్నిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

## హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ భాషా ను అభినందించిన ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం అధ్యక్షులు నెట్టెం రఘురాం



జగ్గయ్యపేట ఏప్రిల్ 16 మనం న్యూస్ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గా నియమితులైన షేక్ హసన్ బాషా ను ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీమంత్రి నెట్టెం రఘురాం అభినందించారు.వెలగపూడి సచివాలయం లో బుధవారం హసన్ భాషను కలిసి శుభాకాంక్షలు అభినందనలను నెట్టెం రఘురాం తెలియజేశారు.ఈ సందర్భాన్ని నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ ముస్లిం సమాజ సంక్షేమం, ఐక్యత మరియు అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. ముస్లిం సమాజ పట్ల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఎప్పుడూ అండగా నిలిచారనీ, వారి అభివృద్ధికి కృషి చేస్తారని ఆయన తెలిపారు. షేక్ హసన్ బాషా నాయకత్వంలో హజ్ కమిటీ యాత్రికులకు నిబద్ధతతో మరియు పారదర్శకంగా సేవలు అందిస్తారని నమ్మకాన్ని నెట్టెం రఘురాం వ్యక్తం చేశారు.

## రెయిన్ బో షూ మార్ట్ ను ప్రారంభించిన జనసేన జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట ఏప్రిల్ 16 మనం న్యూస్బిజగ్గయ్యపేట పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న పద్మావతి కాంప్లెక్స్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన రెయిన్ బో షూ మార్ట్ ను ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభానుప్రారంభించి ప్రో. మధు బాబు కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్, పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, నేతలు కాశీ కిషోర్, షేక్ సత్తార్, పార్టీ సంయుక్త కార్యదర్శి ఈమని కిషోర్, నాయకులు ఆవాల భవాని ప్రసాద్ యాదవ్, కఠారి హరిబాబు, పోలంపల్లి బాలకోటి, బజారు సాయి, న్యాయవాది సామినేని రాము, వెన్నా ప్రశాంత్, గుడ్ల రామారావు, వంకేన వరాలు, ముసిని శివ, పానుగంటి శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## బాదం పప్పులతో కార్డియో మెటబాలిక్ ఆరోగ్యం, బరువు నిర్వహణ



గాంధీనగర్ ఏప్రిల్ 16 మనం న్యూస్: కొత్త పీర్ రివ్యూడ్ ప్రచురణలో, ప్రపంచంలోని ప్రముఖ ఆరోగ్య, పోషకాహార నిపుణులు ప్రతిరోజూ బాదం తినడం కార్డియో మెటబాలిక్ ఆరోగ్యానికి అర్థవంతమైన ప్రయోజనాలను అందిస్తుందని తేల్చారు. 11 మంది శాస్త్రవేత్తలు, వైద్యులు బాదం, కార్డియో మెటబాలిక్ ఆరోగ్యంపై పరిశోధనలు చేయటంతో పాటుగా బాదం ప్రయోజనాలపై ఏకాభిప్రాయానికి వచ్చారు. ప్రతిరోజూ బాదం తినడం వల్ల గుండె ఆరోగ్యం, బరువు నిర్వహణ, గట్ మైక్రోబయోమ్కు మేలు జరుగుతుందని నిపుణులు కనుగొన్నారు. బాదం ఎక్కువగా తీసుకోవడం కొంతమందిలో కొద్దిపాటి బరువు తగ్గడానికి సహాయపడుతుందని కూడా ఈ పరిశోధన తేల్చింది.

## జూన్ 9న జగ్గయ్యపేట రామన్న భువనేశ్వరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కమలానంద భారతి స్వామి



జగ్గయ్యపేట ఏప్రిల్ 16 మనం న్యూస్హిందూ ధర్మ పోరాట యోధులు చత్రపతి శివాజీ మహారాజ్ అనిభువనేశ్వరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కమలానంద భారతి స్వామి అన్నారు. బుధవారం కమలానంద భారతి స్వామి వారిని హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పిన్నం వెంగళరావు, చత్రపతి శివాజీ మహారాజ్ కోర్ కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. జగ్గయ్యపేట పట్టణంలో విజయవాడ రోడ్లో జూన్ 9న చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రారంభానికి ముఖ్య అతిథులుగా కమలానంద భారతి స్వామి వారిని విచ్చేయాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను అందించి ఆశీస్సులు అందుకున్నారు. కమలానంద భారతి స్వామి వారు మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణంలో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేసుకోవడం హిందూ బంధువులందరి తో కలిసి వేడుక నిర్వహించుకోవడం శుభపరిణామం అన్నారు. కోట నిర్మాణం విగ్రహ ఎత్తు వంటి విషయాలను కోర్ కమిటీ ప్రతినిధుల ను అడిగి తెలుసుకున్నారు.

## దేశం పార్టీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా లంక బాబు సురేంద్ర మోహన్ బెనర్జీ



హనుమాన్ జంక్షన్: ఏప్రిల్ 16 మనం న్యూస్తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి ఎల్లప్పుడు పరిపూర్ణం గా ఉంటుందని సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు లంక బాబు సురేంద్ర మోహన్ బెనర్జీ అన్నారు. వీరవల్లి తెలుగు దేశం పార్టీ నూతన అధ్యక్షుడు గా ఏకగ్రీవంగా మరోసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. వీరవల్లి సొసైటీ అధ్యక్షులుగా పలుమార్లు పనిచేసిన ఆయన సొసైటీ ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్ళారు. ఎన్టీఆర్ అభిమానిగా తెలుగుదేశం పార్టీ లో ప్రారంభం నుండి సేవలందిస్తున్న సురేంద్ర మోహన్ బెనర్జీ గత 8 సంవత్సరాలుగా వీరవల్లి తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పనిచేస్తున్నారు.. సురేంద్ర మోహన్ బెనర్జీ అధ్యక్షులుగా అజయ్ కార్యదర్శిగా మరో 8 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## డిప్యూటీ ఎంపీడీఓ గా బాధ్యతలు స్వీకరించిన మూర్తి బాబు

**సత్కరించిన కార్యదర్శుల సంఘం**



పాలకొల్లు, ఏప్రిల్ 16,మనం ప్రతినిధి :పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయం లో ఇంత వరకు వరకు ఈఓ పీ ఆర్ అండ్ ఆర్ డీ గా విధులు నిర్వహించిన టి.మూర్తిబాబు కి డిప్యూటీ యం పి డి ఓ హొదా లభించింది.దీంతో.డిప్యూటీ ఎంపీడీఓ గా మూర్తి బాబు ఉద్యోగ బాధ్యత లు స్వీకరించారు . ఈ సందర్భంగా మూర్తి బాబు కి ఎంపీడీఓ ఎన్ ఎన్ ఉమామహేశ్వర రావు ఆధ్వర్యంలో పాలకొల్లు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం తరపున చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమం లో ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, పంచాయతీ కార్య దర్శుల సంఘ జిల్లా అధ్యక్షులు పాలా శ్రీనివాస్, మండల అధ్యక్షులు బి శివరామ కృష్ణ, అన్ని గ్రామాల పంచాయతీ కార్య దర్శులు పాల్గొని మూర్తి బాబుని అభినందించారు.

## ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే సత్యానందరావు






రావులపాలెం ఏప్రిల్ 16 మనం న్యూస్. రావులపాలెం తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ ప్రజాదర్బార్ సందర్భంగా నియోజకవర్గం లోని పలు గ్రామాల నుండి ప్రజలు వినతులను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ వినతులపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి ప్రజాదర్బార్ లో 292 వినతులు వచ్చాయని తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం వినతులను ఆయా శాఖ అధికారులకు పంపుతామని తెలిపారు. పిర్యాదుల్లో అధికంగా గత ప్రభుత్వంలో జగన్ పేదలను మోసం చేసి ఇచ్చిన ఇళ్ల పట్టాలపై వినతులు, పిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. వాటిని త్వరలోనే పరిష్కరించి అర్హులకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా ప్రజలకు సేవలు

# అందించే క్రమంలో మన మిత్రా యాప్ 9552300009 వాట్సాప్ గవర్నెన్స్





### 60 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్స్ సర్వే సమాంతరంగా చేపట్టాలి కలెక్టర్ పి ప్రశాంతి

రాజమండ్రి ఏప్రిల్ 16 మనం ప్రతినిధిపని చేసే ప్రదేశంలో చక్కటి వాతావరణం కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు బుధవారం మధ్యాహ్నం దివాన్ చెరువు - 2 సచివాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకి మెరుగైన పరిపాలన అందించే బాధ్యత ఉద్యోగస్తులుగా మనపై ఉందని, అందు కోసం జవాబుదారీతనం కలిగిన విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందచెయ్యడం లో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న సర్వే ప్రక్రియ చేపట్టం లో సచివాలయ సిబ్బంది చురుకైన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. పిల్లల ఆధార్ నమోదు లో 115 మంది



పిల్లలను నమోదు 100 శాతం, మరణించిన వారికి చెందిన 31 మంది వివరాలు 100 శాతం, ఎన్ పి సి ఐ ( ఆధార్ బేస్డ్ చెల్లింపు) కి చెందిన 932 గృహాలకు సంబంధించి 2116 మంది వివరాలకు గాను 2113 మంది డేటా ఎంట్రీ చెయ్యడం అభినందనీయం అన్నారు. సచివాలయ కార్యాలయంలో శుభ్రత పాటించడం పై సిబ్బంది చురుగ్గా ఉండాలని పేర్కొన్నారు. ఇంటిలో కంటే ఆఫీసు లోనే ఎక్కువ సమయం గడుపుతామని, మనం పనిచేసే తీరుకు కార్యాలయం ప్రత్యక్ష నిదర్శనం అని కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. వొచ్చే సారి మీ సచివాలయానికి సందర్శనకు వొచ్చే సరికి చక్కగా తీర్చి దిద్దుకోవాలి అని తెలియ చేశారు. సీనియర్ సిటిజన్స్ కు సంబంధించిన పథకాలు అమలు చేయడం లో భాగంగా 60 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్స్ సర్వే సమాంతరంగా చేపట్టాల్సి ఉందన్నారు. సర్వే విషయంలో కచ్చితత్వం కలిగి ఉండడం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సచివాలయం పరిధిలో శానిటేషన్ నిర్వహణ విషయంలో హేతుబద్ధీకరణ కలిగి ఉండాలని పేర్కొన్నారు. మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవలు అందించే క్రమంలో మన మిత్రా యాప్ 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని రావడం జరిగిందనీ జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. సచివాలయం పరిధిలో ఉన్న 1216 మంది కుటుంబాలకు చెందిన వారి ఫోన్ లలో ఈ నెంబర్ ఫీడ్ చెయ్యాల్సి ఉందన్నారు. ఏప్రియల్ 15 నుంచి తొలిదశలో 161 పౌర సేవలు మన మిత్రా యాప్ ద్వారా అందచేయానున్నట్లు కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. ఇప్పటి వరకు గత రెండు రోజుల్లో 43 మంది తో యాప్ డౌన్లోడ్ చేసినట్లు, మిగిలిన వారికి కూడా ఈ యాప్ గురించి వివరించడం, యాప్ డౌన్లోడ్ చేసుకునే విధానంలో చురుగ్గా వ్యవహరించాలని తెలిపారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఇన్చార్జి జిల్లా అభివృద్ధి అధికారి పి. వీణాదేవి , తహసిల్దార్ జీఎల్ఎస్ దేవి, ఎంపీడీవో జేఏ ఝాన్సీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో 42 కిసాన్ డ్రోన్ యూనిట్స్ ఏర్పాటుకు చర్యలు

- యూనిట్ ధర రూ.9.81 లక్షలలో 80 శాతం సబ్సిడీ పొందే అవకాశం
- జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు
- కిసాన్ డ్రోన్లతో గ్రామ స్థాయి వ్యవసాయ యంత్రాల బ్యాంకుల స్థాపన దిశగా ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు పేర్కొన్నారు.

రాజమహేంద్రవరంఏప్రిల్16మనం ప్రతినిధి:బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డ్రోన్ వ్యవసాయ యంత్రాల బ్యాంకుల ఏర్పాటు పై వ్యవసాయ అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలు చేపట్టడం లో భాగంగా డ్రోన్ టెక్నాలజీ ఉపయోగించే దశ లో డ్రోన్ యూనిట్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరుగుతోందని తెలిపారు. ఇందు కోసం ఆసక్తి ఉన్న రైతు సంఘాల గ్రూపులను ఐదు మంది సభ్యులుగా




బృందాలను ఏర్పాటు చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. అందులో భాగంగా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 42 గ్రూపులను గుర్తించి, 19 గ్రూపు లకు చెందిన వారికి శిక్షణ నిమిత్తం పంపడం జరిగిందన్నారు. ఒకొక్క యూనిట్ ధర రూ.9,81,000 లలో తొలుత ఐదుగురు సభ్యులు గల యూనిట్ ధర ముందుగా చెల్లించాల్సి ఉంటుందని జేసి తెలిపారు. లబ్దిదారులు వాటాగా రూ.5 లక్షలు చెల్లించేందుకు ముందుకు వొచ్చే లబ్దిదార బృందాలకు బ్యాంకు ద్వారా మిగిలిన మొత్తం రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో యూనిట్స్ గ్రౌండింగ్ కోసం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ముందుకు రావడం జరిగిందని తెలిపారు. యూనిట్స్ గ్రౌండింగ్ అయిన తర్వాత రూ.7,84,000 మేర సబ్సిడి గ్రూప్ ఖాతాకు జమ చేయనున్నట్లు



తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు మాట్లాడుతూ, యూనిట్స్ గ్రౌండింగ్ అయిన తర్వాత సబ్సిడీ మొత్తం ఫార్మర్ గ్రూప్ లోకి జమ చేయనున్నట్లు తెలిపారు. జిల్లో మేసర్స్ డ్రాగో డ్రోన్స్, విహంగ టెక్నాలజీ లు ఆధ్వర్యంలో యూనిట్స్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఇందు కోసం ఫార్మర్స్ గ్రూప్ లు రైతు సేవా కేంద్రం తో పరస్పర అవగాహన కలిగి ఉండాలన్నారు. యూనిట్స్ 15 రోజుల్లో గ్రౌండింగ్ చెయ్యడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు, ఎల్ డి ఎమ్ పి ఎస్ ప్రసాద్, డి ఆర్డిఏ పిడి ఎన్ వి వి ఎస్ మూర్తి, అధికారులు బి సుజాత కుమారి, కె ఎన్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు. జిల్లా సమాచార పౌర

# లఘు ఖనిజ విధానం 2025

- మైనింగ్ రంగానికి ఊరట, ఎంఎస్ఎంఈలకు లాభం చేకూర్చేలా కేబినెట్ ఆమోదం
- పునరుజ్జీవన దిశగా కీలక అడుగు
- గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్

విజయవాడ ఏప్రిల్ 16 మనం ప్రతినిధి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నేతృత్వంలో మంగళ వారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో, ఖనిజ రంగాన్ని పునరుజ్జీవింపజేయడమే లక్ష్యంగా లఘు ఖనిజాలపై రూపొందించిన "ఏపీ మైనర్ మినరల్స్ పాలసీ 2025" ను ఆమోదించింది. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో (జీడీపీ) ఒకప్పుడు 3.53 శాతం వంతు ఇచ్చిన మైనింగ్ రంగం 2023-24 నాటికి 2.71 శాతానికి పడిపోవడంతో, ఈ రంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం గుర్తించింది. 2022లో వచ్చిన విధానంలో గవర్నమెంట్ భూములపై లీజుల కోసం దరఖాస్తుల ప్రాతిపదికను రద్దు చేయడంతో 6,000 పైగా దరఖాస్తులు అనర్హమయ్యాయి. కొత్త విధానంలో, మార్చి 2022 నాటికి పెండింగ్‌లో ఉన్న ఈ దరఖాస్తులను "ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్" ఆధారంగా పరిష్కరించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇవి ఒక్క సంవత్సరం పాటు మాత్రమే అర్హత కలిగి ఉంటాయి.

### సమతుల్యమైన లీజు మంజూరు విధానం

ఇల్లు నిర్మాణం, నీటి ప్రాజెక్టులు, రహదారి అభివృద్ధి కోసం అవసరమైన గ్రానైట్, రోడ్ మెటల్ వంటి బిల్డింగ్ మెటీరియల్స్‌కు దరఖాస్తు విధానం కొనసాగుతుంది. సిలికా శాండ్, డోలోమైట్ వంటి ఇండస్ట్రియల్ ఖనిజాలకు ఉత్పత్తితో అనుసంధానించిన ప్రీమియంతో వేలం విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. పట్టా, డీకేటీ, అటవీ భూములపై దరఖాస్తుల ద్వారా లీజుల మంజూరు కొనసాగుతుంది.

### ఫీజులు, ప్రీమియంపై సవరణలు, లీజు గడువు పెంపు

లీజు మంజూరుకు సంబంధించిన ప్రీమియాన్ని డెడ్ రెంట్ పై 10 రెట్లు నుంచి 5 రెట్లకు తగ్గించారు. ఈ మొత్తాన్ని 23 ఏళ్లలో రెండు ఈజీ ఇన్‌స్టాల్‌మెంట్లుగా చెల్లించవచ్చు. లేబర్ ఇంటెన్సివ్ పరిశ్రమల సహాయార్థం స్లాబ్‌లకు మరింతగా తగ్గించి 3 రెట్లు చేశారు. డెడ్ రెంట్లు ఇకనుంచి త్రైమాసికంగా కాకుండా వార్షికంగా సీజినియరేజ్ ఫీపై సర్దుబాటు చేయనున్నారు. కొత్తగా మంజూరు అయ్యే గ్రానైట్, ఇండస్ట్రియల్ మినరల్స్ లీజులు 20 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాలకు పెంచారు. రోడ్ మెటల్ (క్యాప్టివ్ క్రషింగ్ యూనిట్ల కోసం) లీజులు 15 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాలకు, మిగిలిన ఖనిజాల కోసం 5 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాలకు పెంచారు. గతంలో 10 రెట్లు డెడ్ రెంట్ చెల్లించి లభించిన లీజులకు కూడా ఈ కొత్త గడువులు వర్తింపజేయబడతాయి.

### కోవిడ్ లెవీ రద్దు: ప్రవీణ్ కుమార్




2021లో కోవిడ్ ఖర్చుల నిమిత్తం విధించిన "కన్సిడరేషన్ అమౌంట్" ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు మైనింగ్ శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తెలిపారు. కొత్త విధానంలో స్పష్టమైన టన్నేజ్ ఆధారిత సీజినియరేజ్ ఫీ విధానం అమలు చేయబడుతుంది. ప్రత్యేకంగా డోలమైట్, షేల్, స్లేట్‌లపై ఎలాంటి అదనపు భారాలు ఉండవు, పోటీతత్వం ఉన్న రాష్ట్రాల నుంచి పరిశ్రమలు వలసకు గురికాకుండా చూస్తారు.

### పూర్తి డిజిటలైజేషన్

లీజు దరఖాస్తు నుంచి సర్దుబాటు, ట్రాన్స్ఫర్, పునరుద్ధరణ, మరియు కంప్లయన్స్ వరకు అన్నీ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో చేయనున్నారు. డ్రోన్లు, సీసీటీవీలు, వెయ్‌బ్రిడ్జులు, మైన్ సర్వైలెన్స్ సిస్టమ్ ద్వారా మైనింగ్‌ను రియల్ టైంలో మానిటర్ చేస్తారు.

### వ్యర్థాల నిర్వహణ, శాస్త్రీయ ముగింపు

డంపింగ్ కోసం అదనపు భూమిని లీజులో భాగంగా మంజూరు చేస్తారు. లైమ్‌స్టోన్ లేదా గ్రానైట్ వ్యర్థాల డంపింగ్‌కు అనుమతి ఉంటుంది. అలాగే, ఖాళీ గవర్నమెంట్ భూముల్లో లేదా ముగిసిన లీజుల్లో ఉన్న ఓవర్‌బర్డెన్ డంప్స్‌కి వేలం ద్వారా వినియోగం కల్పించనున్నారు.

### పాత సమస్యల పరిష్కారానికి ఓటీఎస్

గత సంవత్సరాల్లో పెండింగ్‌లో ఉన్న లీజు వివాదాలు, పద్ధతులు పరిష్కరించేందుకు ఒక సంవత్సరం పాటు ఒకసారి మాత్రమే లభించే ఓటీఎస్ పథకాన్ని ప్రవేశపెట్టారు. జరిమానాలను 10 రెట్ల నుంచి 2 రెట్లు, 5 రెట్ల నుంచి 1 రెట్టుకు తగ్గించారు. మైనింగ్ కార్యాలయాల ముసుగులో ఉన్న గనులు మళ్లీ తెరవడానికి ఇది దోహదపడుతుంది. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వానికి రావలసిన రాబడులు సమర్థవంతంగా వసూలు చేయగలుగుతారు.

### బాధ్యతాయుతమైన మైనింగ్ ప్రభుత్వ సంకల్పం

ముందస్తు క్లియరెన్స్ కోసం ఖనిజ, రెవిన్యూ, అటవీ, పర్యావరణ, కాలుష్య నియంత్రణ వంటి శాఖలతో కూడిన ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కమిటీ ఏర్పాటు చేస్తారు. కుటుంబ సభ్యులకు లీజు బదిలీపై ఫీజును మాఫీ చేస్తారు. గత పాలనలో చిన్న మైనర్లకు తలుపులు మూసివేయగా, ఇప్పుడు వారి కోణంలో చక్కటి విధానం తీసుకొచ్చామని గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తెలిపారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ విధానం కు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఏపీ మైనర్ మినరల్స్ పాలసీ 2025 అనేది లీజుదారుల కేంద్రంగా, పారదర్శకంగా, ప్రగతిశీలంగా రూపొందించబడిందని ప్రవీణ్ కుమార్ చెప్పారు. ఇది స్థానిక ఉద్యోగావకాశాలు, బాధ్యతాయుత మైనింగ్, పెట్టుబడిదారుల నమ్మకాన్ని పెంపొందించడానికి బలమైన అడుగుగా నిలుస్తుందన్నారు.

## ఆర్ అండ్ బి అతిథి గృహాన్ని సందర్శించిన కలెక్టర్





కాకినాడ ఏప్రిల్ 16 మనం న్యూస్ కాకినాడ రూరల్ సూర్యారావుపేట వద్ద ఉన్న ఆర్ అండ్ బీ అతిథి గృహాంహన్ని, ఎన్టీఆర్ బీచ్ లోని ఇతర అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సముద్ర తీరాన్ని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పి సుందరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా ఆల్ ఈజ్ వెల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను బుధవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. పర్యాటక శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. గత జూన్ నెలలో సుమారుగా 500 కొబ్బరి మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవడంతో ఆల్ ఈజ్ వెల్ స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలకు ఆ సంస్థ ప్రతినిధులను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఆల్ ఈజ్ వెల్ స్వచ్ఛంద సంస్థ బీచ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు అవసరమైన విద్యుత్ సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఇన్చార్జి పర్యాటక అభివృద్ధి అధికారిణి, పాడా పీడీ చైత్ర వర్షిణి, ఆల్ ఈజ్ వెల్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ కిషోర్, ఇతర సభ్యులు కమలాకర్, శ్రీనివాస్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోజుకో అరటిపండు తింటే ఈ వ్యాధి నయమవుతుందా? పరిశోధనల్లో షాకింగ్ బెనిఫిట్స్



బీపీ పేషెంట్లు రోజుకు ఒక అరటిపండు తినాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ముఖ్యంగా రక్తపోటు సమస్యలు ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరమని చెప్తున్నారు. రోడ్డు మీద ఎంతో చౌకగా దొరికే ఈ పండులో ఉండే గుణాలు ఎన్నో సమస్యలకు చెక్ పెడుతుందని తాజా అధ్యయనాలు చెప్తున్నాయి. ఇందులో ఉండే పోషకాలు ఏయే సమస్యలను తగ్గిస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం.

### పొటాషియం అధికంగా ఉంటుంది

అరటిపండులో పొటాషియం అధికంగా ఉంటుంది. పొటాషియం అనేది రక్తపోటును నియంత్రించడంలో కీలక పాత్ర పోషించే ఒక ముఖ్యమైన ఖనిజం. ఇది శరీరంలోని సోడియం ప్రభావాన్ని సమతుల్యం చేయడానికి సహాయపడుతుంది, తద్వారా ఆరోగ్యకరమైన రక్తనాళాల పనితీరును ప్రోత్సహిస్తుంది. అధిక రక్తపోటును కంట్రోల్ చేయడానికి డాక్టర్లు తరచుగా అరటిపండు వంటి పొటాషియం అధికంగా ఉండే ఆహారాలను సిఫార్సు చేస్తారు.

### సోడియం తక్కువగా ఉంటుంది

అరటిపండులో పొటాషియం ఎక్కువగా ఉండటంతో పాటు, సహజంగా సోడియం తక్కువగా ఉంటుంది. అధిక పొటాషియం తక్కువ సోడియం కలయిక ఆరోగ్యకరమైన రక్తపోటు స్థాయిలను నిర్వహించడానికి చాలా ప్రయోజనకరం. అధిక రక్తపోటు ఉన్నవారు తీసుకోవాల్సిన ఆహారంలో సోడియం తగ్గించడం ఒక ముఖ్యమైన సూచన.

### ఫైబర్ కు మూలం

అరటిపండులో కరిగే కరగని ఆహార ఫైబర్ బాగా ఉంటుంది. ఫైబర్ మొత్తం హృదయ సంబంధిత ఆరోగ్యానికి తోడ్పడుతుంది ఆరోగ్యకరమైన కొలెస్ట్రాల్ స్థాయిలు మరియు బరువు నిర్వహణకు మద్దతు ఇవ్వడం ద్వారా రక్తపోటును పరోక్షంగా నియంత్రించడంలో సహాయపడుతుంది.

### శక్తిని అందిస్తుంది

అరటిపండు సహజ చక్కెరల (ఫ్రక్టోజ్, గ్లూకోజ్ సుక్రోజ్) గొప్ప మూలం, ఇది తక్షణ మరియు నిలకడగా ఉండే శక్తిని అందిస్తుంది. ఇది అధిక సోడియం మరియు అనారోగ్యకరమైన కొవ్వులు ఉండే ప్రాసెస్ చేసిన స్నాక్స్‌పై ఆధారపడటాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది, ఇవి రక్తపోటును ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి.

### ఆహారంలో సులభంగా చేర్చుకోవచ్చు

అరటిపండు ఒక అనుకూలమైన బహుముఖమైన పండు, దీనిని రోజువారీ ఆహారంలో సులభంగా చేర్చుకోవచ్చు. వీటిని స్నాక్‌గా తినవచ్చు, స్మూతీలు, ఓట్‌మీల్, పెరుగులో కలపవచ్చు లేదా బేకింగ్‌లో ఉపయోగించవచ్చు. ఈ సౌలభ్యం కారణంగా ప్రజలు దీని ఆరోగ్య ప్రయోజనాలను క్రమం తప్పకుండా పొందడం సులభం అవుతుంది. అరటిపండు అధిక పొటాషియం తక్కువ సోడియం కలిగి ఉండటం వల్ల, అలాగే ఫైబర్ శక్తి మంచి మూలం కావడం వల్ల ఒక ప్రయోజనకరమైన సూపర్ ఫ్రూట్ అని, ముఖ్యంగా రక్తపోటును నియంత్రించే వారికి ఇది చాలా మంచిదని నిపుణులు చెప్తున్నారు. గుండె ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా రోజుకు కనీసం ఒక అరటిపండు తినాలని సూచిస్తున్నారు.

## మెంతులు తమల పాకులతో కలిపి తినడం వల్ల ఈ సమస్యలు పరార్..!



తమలపాకులు, మెంతి గింజలు రెండూ ఆయుర్వేదంలో అత్యంత ప్రభావవంతమైన ఔషధ లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. కానీ ఈ రెండింటినీ కలిపి తీసుకుంటే అది అనేక ఆరోగ్య సమస్యలను నయం చేయడంలో సహాయపడుతుంది. మెంతులు తమలపాకులతో కలిపి తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాం?మధుమేహాన్ని నియంత్రిస్తుంది: మెంతి గింజలలో ఉండే గ్లూకోసమైన్ ఫైబర్ రక్తంలో చక్కెరను నియంత్రిస్తుంది. తమలపాకులు ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచడంలో సహాయపడతాయి. ఈ కలయిక టైప్-2 డయాబెటిస్ ఉన్నవారికి ప్రయోజనకరంగా ఉంటుంది.హార్మోన్లను సమతుల్యం చేస్తుంది: మెంతులు స్త్రీ హార్మోన్లను సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. తమలపాకులు గర్భాశయాన్ని శుభ్రంగా ఉంచడంలో, ఋతు నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి. ఇది %ూజూణ%, క్రమరహిత ఋతుస్రావం సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు.జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: తమలపాకులో యాంటీ-మైక్రోబయల్, జీర్ణ లక్షణాలు ఉంటాయి. మెంతులు ఫైబర్, యాంటీ-యాసిడిక్ లక్షణాలతో సమృద్ధిగా ఉంటాయి. ఈ రెండూ కలిసి గ్యాస్, అసిడిటీ, అజీర్ణ సమస్యలను తొలగిస్తాయి.కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం: మెంతులు శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి. అలాగే తమలపాకులు రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఇది కీళ్ల వాపు, నొప్పి, ఆర్థరైటిస్ వంటి సమస్యలలో ఉపశమనాన్ని అందిస్తుంది.నోటి దుర్వాసనను తగ్గిస్తుంది: తమలపాకులో క్రిమినాశక లక్షణాలు ఉన్నాయిజ ఇవి నోటిలోని క్రిములను చంపుతాయి. మెంతులు నోటి వాపు, పూతల నుండి ఉపశమనాన్ని అందిస్తాయి.

### ఎలా తినాలి

ఉదయం ఖాళీ కడుపుతో తమలపాకులు, మెంతులు తినండి. దీని కోసం రాత్రంతా నానబెట్టిన 1 టీస్పూన్ మెంతులు తీసుకోండి. ఉదయం ఒక తాజా తమలపాకు తీసుకొని అందులో ఈ మెంతి గింజలను వేయండి. దీని తర్వాత దాన్ని నమిలి గోరువెచ్చని నీటితో తాగాలి.